మూగజీవాలంటే అలుసా?

పశువులు, జీవాలకు అందని వైద్యం

- ఏళ్లుగా పశువైద్యులు కరువు
- మందుల కొరతతో తీవ్ర ఇబ్బందులు
- పలు గ్రామాల్లో కనిపించని పశు వైద్యశాలలు



సుజాతనగర్‌లోని పశు వైద్యశాల

సుజాతనగర్: మండలంలోని మూగజీవాలకు వైద్యం అందేలా కనిపించడం లేదు. దీంతో గొర్రెల కాపర్లు, పశువుల యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుజాతనగర్‌లో పశువైద్య కేంద్రం, సర్వారం, పాత అంజనాపురం గ్రామాల్లో ఉపకేంద్రాలు ఉన్నాయి. వీటిలో సరిపడా సిబ్బంది లేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. సిబ్బంది లేకపోవడంతో ప్రైవేట్ వైద్యులను ఆశ్రయించి వేలాది రూపాయల ఖర్చులు పెట్టుకోవాల్సిన పరిస్థితులు నెలకొంది. సర్వారం, అంజనాపురం గ్రామాల్లోని పశు వైద్య ఉప కేంద్రాలు శిథిలావస్థకు చేరడంతో బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. మండలంలో తెల్ల, నల్లజాతి పశువులు కలిపి 9,000, మేకలు, గొర్రెలు 14 వేలు, కోళ్లు 43 వేల వరకూ ఉన్నాయి. పశువులకు ఏడాదికి రెండు సార్లు, గొర్రెలకు ఏడాదికి మూడు సార్లు నట్టల నివారణ మందులు పంపిణీ చేయాల్సి ఉండగా అదికూడా సంపూర్ణంగా జరగడం లేదు. అదేవిధంగా చికిత్సకు వచ్చిన జీవాలు, పశువులకు మందులు లేకపోవడంతో పాడి రైతులు ఇబ్బంది పడుతున్నారు. ప్రైవేట్ మెడికల్ షాపుల్లో మందులు కొని వైద్యం చేయించుకుంటున్నారు.

అటెండర్లతో సరిపుచ్చుకోవాల్సిందే..

పాత అంజనాపురం పశు వైద్య ఉపకేంద్రం పరిధిలో సింగభూపాలెం, చిమ్నాతండా, బేతంపూడి, నరసింహసాగర్, జామ్లాతండా గ్రామాలున్నాయి. ఉపకేంద్రంలో ఐదేళ్లుగా మహిళా అటెండర్లతో నెట్టుకొస్తున్నారు. ఇక్కడి జూనియర్ వెటర్నరీ అధికారి(జేవీఓ)ను ఐదేళ్ల క్రితం డిప్యూటేషన్‌పై పంపించారు. నాటి నుంచి ఆ స్థానంలో ఎవరినీ కేటాయించకపోవడంతో అటెండర్లతోనే సరిపుచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అదేవిధంగా సర్వారంలో అటెండర్, ఎల్ఎస్ఏ(స్టాక్ అసిస్టెంట్) ఉండాల్సి ఉండగా కేవలం ఎల్ఎస్ఏతోనే సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. 15 ఏళ్లుగా ఇక్కడ కాంట్రాక్టు కింద పనిచేస్తున్న అటెండర్‌ను సుజాతనగర్‌కు పంపించడంతో ఎప్పటినుంచో అటెండర్ పోస్టు ఇక్కడ ఖాళీగా దర్శనమిస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మూగ జీవాలకు వైద్యం అందేలా సిబ్బందిని నియమించి, మందుల కొరత లేకుండా సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

అసలు వైద్యశాలలే కరువు..

మండలంలో గరీబ్‌పేటలో పశువైద్యశాల లేక పాడి రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గ్రామంలో చాలా వరకు పాడి పశువుల పైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఇక్కడ ఉన్న మూగ జీవాల సంఖ్యకు అనుగుణంగా ఉన్నతాధికారులు వైద్యశాలను ఏర్పాటు చేయకపోవడంతో పశువైద్యం నిమిత్తం అవస్థలు తప్పడం లేదు. అదేవిధంగా గొల్లగూడెం గ్రామంలోనూ పాడి పశువులు, గొర్లు, మేకలు అధిక సంఖ్యలోనే ఉన్నా ఇక్కడ కూడా ఆస్పత్రి సౌకర్యం లేదు. పశువులకు ఏదైనా సమస్య వస్తే పక్క గ్రామాలకు వెళ్లడం లేదా ప్రైవేట్ వైద్యులను నమ్ముకోవాల్సి వస్తుందని పాడి రైతులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి గ్రామాల్లో వైద్యశాలలు ఏర్పాటు చేయాలని వేడుకుంటున్నారు.

వైద్యులను నియమించాలి



పాత అంజనాపురంలో వైద్యుడిని డిప్యూటేషన్‌పై పంపించి ఏళ్లు గడుస్తోంది. అతడిని వెనక్కి తీసుకరావాలి. లేదా అతని స్థానంలో మరో వైద్యుడిని కేటాయించాలి. పాడి సంపద అధికంగా ఉన్న గ్రామాలకు నిధులు కేటాయించి నూతన ఆస్పత్రులను నిర్మించాలి.

– కాట్రాల తిరుపతిరావు, గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం జిల్లా కార్యదర్శి

ఆస్పత్రి నిర్మించాలి



గరీబ్‌పేట పరిధిలో పశు సంపద సంఖ్యకు అనుగుణంగా ఆస్పత్రి లేదు. ఎప్పటి నుంచో వినతులు ఇస్తున్నా సమస్య పరిష్కారం కావడం లేదు. ఆస్పత్రి లేకపోవడంతో దూరంలో ఉన్న సుజాతనగర్‌కు వెళ్లాల్సి వస్తోంది. అక్కడికి వెళ్లే లోపే మూగ జీవాలు మృత్యువాత పడుతున్నాయి. తక్షణమే గ్రామంలో పశువైద్యశాలను నిర్మించాలి.

– కస్నబోయిన భద్రం, మాజీ ఎంపీటీసీ, గరీబ్‌పేట

ఇబ్బంది పడుతున్నాం..



వైద్య సిబ్బంది లేక పశువులకు సరిగా అందక ఇబ్బందులు పడుతున్నాం. అరకొర సిబ్బంది ఉన్నా మందులు సైతం లేక అవస్థలు పడుతున్నాం. ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో మరీ ఇబ్బందిగా ఉంటుంది. ప్రైవేట్ వైద్యులు దగ్గరకు వెళ్తే జేబులు ఖాళీ అవుతున్నాయి. అధికారులు స్పందించి వైద్యులు, నియమించి, మందులు ఏర్పాటు చేయాలి.

– మాలోత్ రాములు, పాడి రైతు

క్లుప్తంగా

విద్యార్థులను అభినందించిన కలెక్టర్



విద్యార్థిని అభినందిస్తున్న కలెక్టర్ పాటిల్

పాల్వంచరూరల్: ఇటీవల జిల్లాకేంద్రంలో జరిగిన జోనల్ స్థాయి క్రీడాపోటీల్లో ప్రతిభ చూపిన మండలంలోని పాండురంగాపురం హైస్కూల్ విద్యార్థులను కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అభినందించారు. పాండురంగాపురం హైస్కూల్‌ను సోమవారం కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివిధ అంశాల్లో సత్తా చాటిన బి.కార్తీక్, విశ్వతేజ్, సంజన, లక్ష్మిని కలెక్టర్ అభినందించి రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలన్నారు. కాగా, చిన్న వర్షం కురిసినా పాఠశాల క్రీడాప్రాంగణంలో నీరు నిలుస్తోందని, నాలుగు గదులను మరమ్మతు చేయించాలని ఉపాధ్యాయులు, స్థానికులు కోరగా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. తహసీల్దార్ వివేక్, ఎంపీడీఓ కె.విజయభాస్కర రెడ్డి, ఎంపీఓ నారాయణ, డాక్టర్ యుగంధర్ రెడ్డి, హెచ్ఎం ఉత్తమకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓను కలిసిన హెచ్‌ఎంలు



ఎంఈఓను సన్మానిస్తున్న హెచ్‌ఎంలు

జూలూరుపాడు: ఎంఈఓగా బాధ్యతలు చేపట్టిన బానోత్ జుంకీలాల్‌ను సోమవారం స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు కలిసి సన్మానించారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎంలు పి.సంజీవరావు, లక్ష్మీనర్సయ్య, ఎస్కే.మీరా సాహెబ్, మంగవేణి, ఏజీహెచ్ఎస్ సుభద్రమ్మ, కేజీబీవీ ఎస్ఓ ఎం.పద్మజ, ఉపాధ్యాయులు యుగంధర్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

నేడు రైతు సదస్సు

ఇల్లెందురూరల్: మండలంలోని కొమరారం రైతువేదికలో మంగళవారం మునగ సాగుపై రైతుసదస్సు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ ధన్‌సింగ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ.. రైతులకు బహుళ ప్రయోజనాలను సమకూర్చే మునగ సాగును కొమరారం ప్రాంతంలో అత్యధిక విస్తీర్ణంలో చేపట్టేందుకు ఉన్నతాధికారులు నిర్ణయించారన్నారు. ఇందులో భాగంగా రైతులను చైతన్య పర్చే లక్ష్యంతో రైతు సదస్సు ఏర్పాటు చేశామన్నారు. సాగుకు సంబంధించి మొక్కలను పూర్తి సబ్సిడీతో పంపిణీ చేస్తామన్నారు. రైతులు అత్యధిక సంఖ్యలో హాజరై సదస్సును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

108లో ప్రసవం



శిశువును అందజేస్తున్న సిబ్బంది

టేకులపల్లి: 108 అంబులెన్స్‌లోనే గర్భిణి ప్రసవించిన ఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. మండలంలోని బొమ్మనపల్లి గ్రామానికి చెందిన పొగాకు రాజేశ్వరికి పురిటి నొప్పులు రావడంతో 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి బయలుదేరారు. మార్గమధ్యలో నొప్పులు అధికం కావడంతో ఈఆర్‌సీపీ డాక్టర్ మనీష్ సూచనల మేరకు ఈఎంటీ జి.రాధ, పైలట్ తరుణ్ పురుడు పోశారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్టు వారు తెలిపారు.

శాశ్వత మార్కెట్ యార్డు నిర్మించాలి

జూలూరుపాడు: మండల కేంద్రంలో శాశ్వత మార్కెట్ యార్డు నిర్మించాలని సీపీఐ వైరా నియోజకవర్గ కన్వీనర్ ఎర్రబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జూలూరుపాడులో జరిగిన పార్టీ మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... జూలూరుపాడు తాత్కాలిక ఉప మార్కెట్ యార్డులో పత్తి కొనుగోళ్లతో అత్యధిక ఆదాయం వస్తున్నప్పటికీ కనీస సౌకర్యాలు లేక రైతులు, హమాలీలు, వ్యాపారులు ఇబ్బందిపడుతున్నారన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్ర నరేంద్రకుమార్ మాట్లాడుతూ.. పత్తి క్వింటాల్‌కు రూ.10,000లు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు, యాసా రోశయ్య, నాగుల్‌మీరా, యల్లంకి మధు, గార్లపాటి వీరభద్రం, ఎస్‌కె.చాంద్‌పాషా, రజని, వెంకటేశ్వర్లు, వల్లమల్ల సామేలు తదితరులు పాల్గొన్నారు.

ఆహారంలో అయోడిన్ సరిపడా తీసుకోవాలి



మాట్లాడుతున్న సుకృత

టేకులపల్లి: విద్యార్థులు ఆహారంలో అయోడిన్ లోపం లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుకృత అన్నారు. సోమవారం ప్రపంచ అయోడిన్ లోప రుగ్మతల నివారణ దినం సందర్భంగా అయోడిన్ లోపం వల్ల కలిగే సమస్యలపై కోయగూడెం ఆశ్రమ హైస్కూల్లో అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అయోడిన్ లోపంతో గర్భస్రావం, మృతశిశువు జననం, పిండం అభివృద్ధి లోపం, బుద్ధిమాంద్యం గల పిల్లలు జన్మించడం, తక్కువ మానసిక, శారీరక పెరుగుదల, గాయిటర్ వ్యాధిబారిన పడతారన్నారు. ప్రతీ ఉప్పు ప్యాకెట్‌పై అయోడిన్ లోగో ఉండాలని, తయారీ దగ్గర నుంచి ఆరునెలల లోపు ఆ ఉప్పును ఉపయోగించాలన్నారు. ఉప్పును భద్రపరిచిన డబ్బా మూత గట్టిగా బిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ బాలాజీ, అసంక్రామిక వ్యాధుల జిల్లా అధికారి మధు వరుణ్, వైద్యాధికారి కందుల దినేష్, ఆరోగ్య విస్తరణాధికారి దేవా, సూపర్‌వైజర్లు పోరండ్ల శ్రీనివాస్, నాగబండి వెంకటేశ్వర్లు, హెచ్‌ఎం అమర్ సింగ్, రమణకుమారి, వెంకటరమణ, సునీత తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుకు ఎంపీ పరామర్శ

కొత్తగూడెంరూరల్: టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్) జిల్లా అధ్యక్షుడు కల్లోజి శ్రీనివాస్ తల్లి ఇటీవల కన్నుమూయగా ఎంపీ వద్దిరాజు రవిచంద్ర సోమవారం శ్రీనివాస్‌ను పరామర్శించారు. కల్లోజి జయమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి వివరాలు తెలుసుకున్నారు. టీయూడబ్ల్యూజే ఖమ్మం జిల్లా అధ్యక్షుడు ఆదినారాయణతో పాటు ఇస్మాయిల్, కొట్టి వెంకటేశ్వర్లు, చావల పురుషోత్తం, రామ్మూర్తి, దామోదర్, రోహిత్, పోలిశెట్టి ఉపేందర్, హరికృష్ణ, మహేష్ పాల్గొన్నారు.

చెరువులు, కుంటలను రక్షించాలి

జూలూరుపాడు: మండలంలోని చెరువులు, కుంటలు కబ్జాల నుంచి రక్షించాలని కోరుతూ బీఎస్పీ మండల అధ్యక్షుడు తంబర్ల నరసింహారావు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వినతిపత్రాన్ని అందజేశారు. చెరువులు, కుంటలు ఆక్రమణకు గురికావడంతో నీటి సామర్థ్యం తగ్గి ఆయకట్టు సాగు విస్తీర్ణం ఏడాదికి ఏడాది తగ్గిపోతుందన్నారు. సరిహద్దులు నిర్ధారించి, ఆక్రమణలను తిరిగి స్వాధీనం చేసుకోవాలని కోరారు.

దిశ కమిటీ సభ్యుడికి సన్మానం



ఆనందరావును సన్మానిస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి మాజీ జీఎం అందెల ఆనందరావు దిశా కమిటీ సభ్యుడిగా నియమితులైన సందర్భంగా సోమవారం ఐఎన్‌టీయూసీ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ.రజాక్ మాట్లాడుతూ... సింగరేణి కార్మికులు, సంస్థ సమస్యలను దిశ కమిటీలో చర్చించే అవకాశం ఆనందరావు ద్వారా వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పీతాంబరం, చీకటి కార్తీక్, విప్లవ్‌రెడ్డి, బూటుక రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు ఉపాధి కల్పించాలి

టేకులపల్లి: కోయగూడెం ఓపెన్‌కాస్టులో భూములు, ఇళ్లు కోల్పోయిన నిర్వాసిత నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని భూ నిర్వాసితులు కోరారు. ఈమేరకు సోమవారం మహాశక్తి ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. భూములు, ఇల్లు కోల్పోయిన 50 మంది యువకులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, డ్రైవింగ్‌లో శిక్షణ ఇప్పిస్తే సింగరేణి ఓల్వో, ప్రైవేట్ లారీలు, టిప్పర్లపై ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజేషన్ అధ్యక్షుడు దిలీప్‌కుమార్, ఉపాధ్యక్షుడు ఇర్ప నిరుద్యోగ యువకులు నరేష్, జార రవీందర్, ఇర్ప రాము, పాయం కృష్ణ, పాయం నితిన్ తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు రాజీలేని పోరాటం



మాట్లాడుతున్న యాకుబ్‌షావలీ

ఇల్లెందు: దేశ వ్యాప్తంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం, హక్కుల సాధనకు రాజీలేని పోరాటం సాగుతుందని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) జిల్లా కార్యదర్శి యాకుబ్‌షావలీ అన్నారు. సోమవారం ఇల్లెందులోని ఎల్లన్న భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మాస్‌లైన్ అనుబంధ సంఘంగా టీయూసీఐ దేశవ్యాప్త రాజీలేని పోరాటాలకు రూపకల్పన చేసిందన్నారు. సభలు, సమావేశాల విజయవంతానికి తరలివచ్చిన కార్మిక ప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇక మీదట టీయూసీఐ ఉద్యమాలను ఉధృతం చేస్తామన్నారు. ఈ సమావేశంలో నాయకులు మల్లెల వెంకటేశ్వర్లు, కునూరి వీరన్న, సాయి, వేముల గురునాథం, శేషయ్య, బోసు, రఘు, సీతారాములు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ



అఖిల్‌ను అభినందిస్తున్న యాజమాన్యం

కొత్తగూడెంఅర్బన్: కాకతీయ యూనివర్సిటీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన అథ్లెటిక్స్ (క్రాస్‌కంట్రీ)పోటీల్లో 10 కిలోమీటర్ల విభాగంలో కొత్తగూడెం ప్రియదర్శిని డిగ్రీ కళాశాల విద్యార్థి మాలోత్ అఖిల్ ప్రథమ స్థానం సాధించినట్టు కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కాటేపల్లి నవీన్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం కళాశాల ఆవరణలో అఖిల్‌ను సత్కరించి అభినందించారు. త్వరలో జరగబోయే ఆలిండియా యూనివర్సిటీ పోటీలకు ఎంపికయ్యాడన్నారు. ఆలిండియా యూనివర్సిటీ పోటీలకు వారి కళాశాల నుండి ఇద్దరు ఎంపికైనట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ శ్రీరామనేని చలపతిరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ నయీంపాషా, వైస్ ప్రిన్సిపాల్ రాయల వివేక్, పీడీ కాశిమల్ల రమేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సింగరేణి మహిళా కళాశాల విద్యార్థిని..



సింధును అభినందిస్తున్న అధ్యాపకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): సింగరేణి మహిళా డిగ్రీ కళాశాల బీకాం ద్వితీయ సంవత్సరం విద్యార్థిని ఎం.సింధు గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో ఈనెల 16 నుండి 19 వరకు జరిగిన సౌత్ జోన్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్–2024 పోటీలో400 మీటర్ల పరుగు పందెంలో ప్రథమస్థానం సాధించి బంగారుపతకం కైవసం చేసుకుంది. దీంతో ఈనెల 23 నుంచి 30 వరకు భువనేశ్వర్‌లో జరిగే జూనియర్ నేషనల్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైంది. ఈ మేరకు సోమవారం కళాశాల సెక్రటరీ గండా శ్రీనివాస్ తన కార్యాలయంలో విద్యార్థిని సింధును అభినందించి టీ షర్ట్‌ను బహూకరించారు. ప్రిన్సిపాల్ సిహెచ్ శారద, ఫిజికల్ డైరెక్టర్ సావిత్రి, అధ్యాపక బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

జీఓ 29ని రద్దు చేయాలి

ఇల్లెందురూరల్: ఎస్సీ, ఎస్టీ, బీసీ నిరుద్యోగులకు నష్టం చేసే జీఓ 29ని రద్దుచేయాలని సేవాలాల్ సేన మండలాధ్యక్షుడు వాంకుడోత్ రమేష్‌నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఈ జీవోతో ఎస్సీ, ఎస్టీ, బీసీలు తమకు కేటాయించిన రిజర్వేషన్లకే పరిమితమయ్యే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఆయా వర్గాలు సాధించిన మార్కుల ఆధారంగా జనరల్ కేటగిరీని కూడా వినియోగించుకునేలా మార్పులు చేయాలని కోరారు.

ప్రజాసేవలో పారదర్శకతకు పెద్దపీట

- ఎమ్మెల్యే కోరం కనకయ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందు: ప్రజా సేవలో పారదర్శకతకు పెద్ద పీట వేస్తామని, ప్రజాపునాది కలిగిన వారే నేతలుగా రాణిస్తారని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. సోమవారం తన క్యాంపు కార్యాలయంలో పట్టణ కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశం అధ్యక్షుడు దొడ్డా డానియేల్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... సభలు సమావేశాలకు తరలి వచ్చే లీడర్లు క్యాడర్‌తో రావాలని, క్యాడర్ లేని లీడర్ల వల్ల పార్టీకి లాభం జరగదన్నారు. ఇందిరమ్మ కమిటీలు, ఆయా వార్డులలో వార్డు కమిటీలు సమన్వయంలో పని చేయాలని, ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. త్వరలో వార్డుల పర్యటన ఉంటుందన్నారు. ఈ వార్డు పర్యటన నాటికి కమిటీలు సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేసుకుని ప్రజాసమస్యలను సేకరించాలని సూచించారు. పార్టీ కోసం కష్టపడేవారికి అత్యంత ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, వైస్‌చైర్మన్ జానీపాషా, మాజీ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ యదళ్లపల్లి అనసూర్య, పులిగళ్ల మాధవరావు, మడుగు సాంబమూర్తి, బోళ్ల సూర్యం, చిల్లా శ్రీనివాస్, పట్టణ మహిళా అధ్యక్షురాలు గాలిపల్లి స్వరూప, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కొక్కు నాగేశ్వరరావు, పింగళి నరేష్‌కుమార్, ఈసం నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

మునగ, వెదురు సాగుతో లాభాలు



అవగాహన కల్పిస్తున్న ఏడీఏ లాల్‌చంద్

టేకులపల్లి: రైతులు ఒకే రకమైన పంటలను ఏళ్ల తరబడి సాగు చేయడంతో భూసారంతో పాటు దిగుబడులు తగ్గుతున్నాయని, ఉపాధి హామీ పథకం నుంచి పెట్టుబడి పొంది మునగ, వెదురు సాగుచేయడంతో లాభాలు వస్తాయని ఇల్లెందు ఏడీఏ లాల్‌చంద్ అన్నారు. సోమవారం మండలంలోని బేతంపూడి పంచాయతీ వెంకట్యాతండాలో రైతులకు మునగ, వెదురు సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఒక ఎకరంలో వెయ్యి మొక్కలు నాటడంతో విత్తన ఖర్చు, గుంటలు తీయడానికి, మొక్కల సంరక్షణకు ఈజీఎస్ నుంచి లక్ష రూపాయల వరకు పెట్టుబడిని రైతులకు అందజేయడం జరుగుతుందన్నారు. వెయ్యి మొక్కలకు సుమారు లక్ష కాయలు మార్కెట్‌లో అమ్మడంతో లక్ష రూపాయల వరకు ఆదాయం వస్తుందని, మునగాకు ఎండబెట్టి పౌడర్ రూపంలో అమ్మితే అదనంగా ఆదాయం వస్తుందని అన్నారు. మునగ గింజల నుంచి వచ్చే నూనెను కాస్మొటిక్ పదార్థాల్లో వినియోగిస్తారని గింజలను ఎండబెట్టి అమ్మడం ద్వారా కూడా ఆదాయం లభిస్తుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ గడదాసు రవీంద్రరావు, ఏఓ నీరుడు అన్నపూర్ణ, ఎంపీఓ జేఎల్ గాంధీ, ఏపీఓ కాళంగి శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న ఫహీం

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించే కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి ఫహీందాదా పిలుపునిచ్చారు. సోమవారం ఈ మేరకు విద్యాసంస్థల యాజమాన్యాలకు సహకరించాలని కోరుతూ వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఏళ్ల తరబడి విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు చెల్లించకపోవడంతో యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం బకాయిలు విడుదల చేయకుండా విద్యార్థుల ఉసురు పోసుకుందని అదే దారిలో కాంగ్రెస్ కూడా ఉండడం శోచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రసూల్‌పాషా, రణధీర్, శివ, నాగరాజు, వెంకట్, విజయ్‌కాంత్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం



మాట్లాడుతున్న రమేష్

జూలూరుపాడు: కాంగ్రెస్ ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమైందని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి రమేష్ ఆరోపించారు. సోమవారం జూలూరుపాడులో జరిగిన బీజేపీ మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ప్రజలకు మాయమాటలు చెప్పి గెలిపొంది పూటకో మాట చెప్పి మోసం చేస్తుందని విమర్శించారు. పూర్తి స్థాయిలో రుణమాఫీ చేస్తామని చెప్పి చేయలేదన్నారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు రూ.4,000లు ఇస్తామని ఇవ్వడంలేదన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కమిటీల పేరుతో పేదలకు ఇబ్బంది పెడితే గత ప్రభుత్వానికి పట్టిన గతి కాంగ్రెస్‌కి పడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మాదినేని సతీష్, బీజేపీ మండలాధ్యక్షుడు సిరిపురపు ప్రసాద్, కార్యదర్శి భూక్యా రమేష్, సిరిపురపు పుల్లారావు, గోపాల్ రావు, నర్వనేని కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వితరణ

సూపర్‌బజార్(కొత్తగూడెం): అనారోగ్యానికి గురైన స్థానిక ఆటోడ్రైవర్ రాజేష్ కుటుంబానికి సోమవారం తోటి డ్రైవర్లు బియ్యం, నిత్యావసర సరుకులు అందించారు. ఆటో యూనియన్ నాయకులు మర్రి కృష్ణ, బాబ్‌జానీ, మాటేటి వెంకట్ ఉన్నారు.

మహాసభలకు తరలిన నాయకులు

ఇల్లెందు: ఐద్వా రాష్ట్ర మహాసభలకు ఇల్లెందు నుంచి సీపీఎం అనుబంధ మహిళా సంఘం నాయకులు, కార్యకర్తలు, సభ్యులు తరలివెళ్లారు. స్థానిక సీపీఎం కార్యాలయం వద్ద మహిళా సంఘం నాయకురాలు ఆలేటి సంధ్య జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కొత్తగూడెం పట్టణంలో జరుగు బహిరంగ సభ, మరుసటి రోజు మహాసభను విజయవంతం చేయాలని కోరారు. 33 శాతం మహిళలకు రిజర్వేషన్లు ప్రకటించి అమలు చేయాలన్నారు. మహిళలపై లైంగిక వేధింపులు, దాడులు అరికట్టాలని డిమాండ్ చేశారు. సభలకు తరలి వెళ్లిన వారిలో పద్మ, కాంతమ్మ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను అమలుచేయాలి

జూలూరుపాడు: ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా చెప్పిన మాట నిలబెట్టుకోవాలని ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు దిబ్బెందుల సాయికుమార్ అన్నారు. సోమవారం మండలకేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈనెల 25న ఖమ్మం టీఎన్జీవోస్ ఫంక్షన్‌హాల్‌లో జరిగే మాదిగల ధర్మ యుద్ధం మహా సదస్సుకు అధిక సంఖ్యలో తరలి వచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు కాకటి వెంకట్, మోదుగు శివ, దేవరకొండ చంటి, కిన్నెర ఉదయ్, రంజిత్, ప్రదీప్, వికాస్, రాము, శివ పాల్గొన్నారు.

అమరవీరుల సంస్మరణ దినోత్సవం



నివాళులర్పిస్తున్న బెటాలియన్ పోలీసులు

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం చాతకొండ 6వ బెటాలియన్‌లో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కమాండెంట్ ఎ.అంజయ్య అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతి భద్రత పరిరక్షణలో అమరవీరుల త్యాగాలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ ఎండి.రషీద్, ఆర్ఐలు శ్రీరామ, సత్యనారాయణ, శ్రీరామ్ బ్రహ్మం, జివి రామరావు, ప్రసాద్ తదితరులు ఉన్నారు.